# మగ బుద్ధి

-షకీలా బేగం

ఆ రోజు నేను ఆ వూరికి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన అయిదోరోజు. బ్యాంక్ నుండి ఐదు గంటలకు బయటపడ్డాను. బ్యాంక్ నుండి వచ్చేటప్పుడు అమ్మ మందులు తెమ్మంది. ఆ విషయం గుర్తుకొచ్చి మెడికల్ షాప్ కోసం అటూ ఇటూ చూశాను. మందుల షాప్ కనిపించింది.

గబగబా స్కూటర్ అటు పోనిచ్చాను. ఆ సమయంలో రోడ్డు బాగా రష్‌గా వుంది.

షాప్‌లో అడుగుపెట్టగానే నాకు మతిపోయినంత పని అయ్యింది. ఎందుకంటే ఆ షాప్‌లో వున్న ఆవిడ ఊర్మిళ పోలికలో ఉంది.

వయస్సు ఇరవై అయిదేళ్ళకు మించి ఉండదు. బంగారపు ఛాయతో మెరిసిపోతోంది. దానికి తగ్గట్టు ఆకుపచ్చని సాదా చీర అదే రంగు జాకెట్టూ ధరించింది.

'ఊర్మిళ అయినా మేకప్‌తో అలా ఉంటుంది. ఈవిడ మేకప్ లేకుండానే ఇలా ఉండేమిట్రా బాబూ' అనుకుంటూ ఈలోకంలోకి వచ్చాను.

నేను వెళ్ళగానే ఆవిడ ఏమిటి? అని అడగలేదు. ఎంతో పరిచయం ఉన్న దానిలా నవ్వి చేయి చాపింది. నేను అప్రయత్నంగా మందులచీటి ఇచ్చాను. రెప్పార్పకుండా తననే చూస్తున్నాననుకొందేమో కొద్దిగా సర్దుకొని కూర్చుంది.

మందులన్నీ షాప్‌లో ఉన్న కుర్రాడు ప్యాక్ చేశాడు. ఆవిడ మాత్రం బిల్లుకాగితం నా ముందుకు తోసి మళ్ళీ నవ్వింది.

నేను డబ్బులిచ్చి మందులు తీసుకొని కావాలనే గుర్తున్నా మందుల చీటి అక్కడ వదిలేశాను.

ఆవిడ నన్ను ఏమని పిల్చి ఇస్తుందో అనుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేస్తున్నాను.

షాప్‌లో ఉన్న చిన్నకుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి ''సార్ ఈ చీటి అమ్మగారు మీకిమ్మన్నారు'' అన్నాడు.

''థాంక్స్'' అని స్కూటర్ స్టార్ట్ చేశాను.

★★★

ఆరోజు-

''అమ్మా మందులు కావాలా?'' అని అడిగాను.

''ఎందుకురా పదిహేను రోజులకు తెచ్చావుకదా'' అంది అమ్మ.

నా పొరపాటుకు నేనే నాలుక్కర్చుకొన్నాను.

ఎలాగైనా షాప్‌కెళ్ళాలని చిన్న స్లిప్ మీద నోటికొచ్చిన కొన్నిమందులు వ్రాసి షాప్ కెళ్ళాను.

ఆ స్లిప్ క్రింద మరొక స్లిప్ ఉంచి అందులో 'ఐ లవ్ యూ' అని వ్రాసి ఆవిడ చేతికి నా చేయి తగిలేటట్లు ఉంచాను.

ఆవిడ రెండు చీటీలు చూసుకొని మందులిచ్చి చిన్నగా నవ్వుకొంది.

పిట్టలైన్లోకొస్తోంది అనుకొని నేను కూడా నవ్వేసి ఇంటిదారి పట్టాను.

★★★

డియర్ ఊర్మిళా,

సారీ నీ పేరు తెలియదు. నీలో ఊర్మిళ పోలికలు ఎక్కువగా కనిపించటంతో ఇలా వ్రాస్తున్నాను. నేను ఇక్కడే బ్యాంక్‌లో పనిచేస్తున్నాను. నేను ఇచ్చిన స్లిప్ చూసి నువ్వు నవ్వావంటే నీకు నామీద సదభిప్రాయం ఏర్పడింది అనుకుంటాను. చెబితే నమ్మవు డియర్; బ్యాంక్‌లో ఉన్నా, ఇంట్లో ఉన్నా, రోడ్డు మీద ఉన్నా, బెడ్‌రూమ్‌లో ఉన్నా, బాత్‌రూమ్‌లో ఉన్నా ఎక్కడ ఉన్నా నువ్వే గుర్తుకొస్తున్నావ్. బ్రహ్మచారిని కదా నిద్రకు కూడా దూరం అయ్యాను డియర్. నా ప్రేమను నువ్వు అంగీకరిస్తే ఆదివారం సాయంత్రం నవరంగ్ సెంటర్లోకి ఆకుపచ్చని చీరకట్టుకుని వస్తావు.

-శేఖర్

నేను వెళ్ళగానే ఆవిడ ఏమిటి? అని అడగలేదు. ఎంతో పరిచయం ఉన్న దానిలా నవ్వి చేయి చాపింది. నేను అప్రయత్నంగా మందులచీటి ఇచ్చాను. రెప్పార్పకుండా తననే చూస్తున్నాననుకొందేమో కొద్దిగా సర్దుకొని కూర్చుంది.

ఉత్తరం వ్రాసిన తర్వాత నా మనసు కుదుటపడింది.

ఆ ఉత్తరం ఆ షాప్‌లో ఉన్న కుర్రాడికిచ్చి వచ్చేశాను.

సాయంత్రం షాప్ వైపు చూశాను.

ఆవిడ కోపంగాలేదు. మునపటిలాగే నవ్వింది.

'ఏంట్రా బాబు' పిచ్చిదాన్లా నవ్వుతుందే కానీ సమాధానం ఇవ్వదే! ఎంతటి వాళ్ళయినా నా పర్సనాలిటీ నా ఉద్యోగం చూసి బుట్టలో పడేవాళ్ళు. ఇది మాత్రం అర్థం కావటం లేదు. అన్నిటికీ ఒకే నవ్వు అనుకుంటూ ఇంటి దారి పడుతూంటే- ఆ షాప్ కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి ''సార్! అమ్మగారు ఇమ్మన్నారు'' అని చిన్న కవరిచ్చాడు.

★★★

అమ్మ కూరగాయల వాడితో గొడవపడినట్లుంది. ఇప్పట్లో ఇటు రాదులే అనుకొని ముందు గదిలోనే ఆత్రంగా కవర్ విప్పాను.

శేఖర్‌గార్కి,

మీరు నన్ను ప్రేమిస్తున్నాను అని లవ్ లెటర్ వ్రాశారు. నేను కూడా మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. పెళ్ళి కూడా మిమ్మల్నే చేసుకోవాలి అనుకుంటున్నాను. కానీ నాకా అదృష్టం లేదు. ఎందుకంటే ఒక యాక్సిడెంట్‌లో నాకాలు మోకాలు వరకు తీసేశారు. కృత్రిమకాలు అమర్చుకున్నాను. మీలా ఎందరో మగాళ్ళు నా అందం చూసి ఎగబడ్డారు. కానీ నా సంగతి విన్నాక వెనక్కి తగ్గారు. మీరు మాత్రం అలాంటి వారిలా కనిపించటం లేదు. ఆదివారం సాయంత్రం నవరంగ్ సెంటర్లో కలుస్తాను. ప్లీజ్ వస్తారు కదూ.

ఇట్లు
మీ
ఊర్మిళ

లెటర్ పూర్తిచేసి బయటకు చూశాను. అమ్మ గుమ్మందగ్గర నిలబడింది.

''ఏరా సురేఖ వస్తున్నట్లు బ్యాంక్‌కి లెటర్ వ్రాసిందా?'' అంది.

''లేదమ్మా! ఇది మా ఫ్రెండ్ వ్రాశాడ్లే'' అని ఆ లెటర్ మడిచి బయట చెత్తకుండీ దగ్గర పారేసి వచ్చాను.

అన్నీ మన మంచికే అన్నట్లు మా ఆవిడ ఆ ఆదివారమే వస్తున్నట్లు ఫోన్ వచ్చింది.

అమ్మ మా ఊరు వెళ్ళిపోయింది.

మందులకోసం ఆ షాప్‌కెళ్ళాల్సిన అవసరం కూడా పోయింది.

నేను బ్యాంక్‌కి వెళ్ళే రూట్ కూడా మార్చేశాను.

ఆ షాప్ గురించి పూర్తిగా మర్చిపోయాను.

ఎప్పుడన్నా బాబీగాడికి మందులు కావలిస్తే మా

ఆవిడే తెచ్చుకొనేది.

★★★

ఆ రోజు

నేను ట్రాన్స్‌ఫర్ మీద మావూరు వెళ్ళిపోతున్నాను.

సామాన్లు అన్నీ సర్దేసి లారీ కోసం ఎదురుచూస్తున్నాము.

సరిగ్గా ఆ సమయంలో ఆ మెడికల్ షాప్ ఆవిడ మా ఇంటికి వస్తోంది.

మా ఆవిడ ఆవిడకి ఎదురువెళ్ళి రావే, నేనే వద్దామనుకుంటున్నా అంది.

ఆవిడ మాట్లాడకుండా అదే నవ్వు నవ్వుతూ వస్తోంది.

''ఏవండీ! మా ఫ్రెండ్ సుజాతండీ. మనం ఇక్కడ మూడేళ్ళుగా వుంటున్నా అది వచ్చినప్పుడు మీరు ఉండే వారు కాదు'' అంది.

నేను లేని నవ్వు తెచ్చుకుంటూ అలాగా ''హలో'' అన్నాను.

ఆవిడ కూడా ఏమీ ఎరగనట్టు ''హలో'' అంది.

నేనింకక్కడ వుండలేకపోయాను.

గబగబా బండి తీసి ''సురేఖా! నేనోగంటలో వస్తాను. చిన్నపని ఉంది.'' అని బయటపడ్డాను.

తర్వాత మరో గంటకు ఇల్లు చేరాను.

లారీ వచ్చింది.

మా తమ్ముడు, లారీ డ్రైవర్ సామాన్లు లారీలో సర్దుతున్నారు.

సుజాత వెళ్ళిపోయిందనుకుంటాను.

మా సురేఖతో ఏదైనా చెప్పిందేమోనని సురేఖ వైపు చూశాను.

మంచిదే!

ఏం చెప్పలేదు. సురేఖ ముఖం ప్రశాంతంగానే ఉంది. ఏ మాత్రం తెల్సినా నాపై యుద్ధం ప్రకటించేది.

★★★

నేను మా ఊళ్లో బ్యాంక్‌కి వెళ్ళగానే నా అడ్రస్‌కి ఒక లెటర్ వచ్చింది. ఆ రైటింగ్ ఎక్కడో చూసినట్లుంది అనుకుంటూనే విప్పాను. అది సుజాత రైటింగే.

శేఖర్ గార్కి,

సుజాత (ఊర్మిళ) వ్రాయునది. మీ భార్య సురేఖ నాకు ఇంటర్ నుండి ఫ్రెండ్. నేను మిమ్మల్ని మీ పెళ్ళిలో చూశాను. మీరు నన్ను మీ పెళ్ళిలో సరిగ్గా చూడలేదు. కాబట్టి గుర్తుపట్టలేదు. మీకు మా వూరి బ్యాంక్‌కి ట్రాన్స్‌ఫర్ అయ్యారనీ త్వరలోనే మా వూరు వస్తున్నామని సురేఖ నాకు ముందే లెటర్ వ్రాసింది. ఆ లెటర్ అందిన రోజే మీరు మా షాప్ కొచ్చారు. మీరు నాకు తెల్సినా తెలీనట్లు నటించాను. మీ 'మగబుద్ధి' తెల్సుకుందామని. మీ వ్యవహారం చాలా దూరం పోతుండటంతో మిమ్మల్ని ఎలా ఆపాలో తెలీక కృత్రిమకాలు నాటకం ఆడాను. ఇప్పటికైనా ఈ విషయం తెలిస్తే సురేఖ మిమ్మల్ని క్షమించదు. ఎందుకంటే నాల్గు లక్షలు పెట్టికొన్నది కనుక. ఇప్పటికైనా మీ మగబుద్ధి మార్చుకుని జాగ్రత్తగా ఉంటారని ఆశించవచ్చా.

-ఊర్మిళ.

నేను తేరుకునేటప్పటికి ఒక గంట పట్టింది.

ఈ ఆడవాళ్ళకి ఎంత తెలివి! ఎంతగొప్పగా బురిడీ కొట్టించింది.

హతోస్మి! ఇప్పట్లో ఆడదానిజోలికి పోకూడదు, గట్టిగా నిశ్చయించుకున్నాను.

వెంటనే ఎదురుగా మెరుపు మెరిసినట్టయింది.

చూస్తే క్రొత్తగా మా బ్యాంక్‌లో చేరిన రమ్య!

★

